



గుడ్డిగా వెలుగుతున్న వీధి దీపం
మొదట్లో నిలబడిందామె— అతి మామూలైన వాయిల్ చీర, జాకెట్టూ ధరించింది. వదులుగా అల్లుకున్న జడ, నొసట కుంకం బొట్టు, రెండు చేతులకి రెండు గాజులు.

సింపుల్‌గా వుందామె అవతారం. గాలికి ఎగిరి పోవాలని ప్రయత్నం చేస్తున్న కాగితాల్ని బలవంతాన క్లిప్పు పెదాల మధ్య బంధించి వుంచినట్లుగా ఆమె

అందాన్ని ఆ మామూలు అలంకరణ గుప్తపర్చాలని చూస్తోంది.

కానీ ఆమె అందమైంది, చాలా అందమైంది. భుజం చుట్టూ తిప్పుకున్న పైట చెంగును ఎడంచేత లాగి పట్టుకుంది. కాళ్ళకి అకు చెప్పులున్నాయి.

గుడ్డి వెలుతురులో నైనా ఆమెలో అణిచిపెట్టబడిన ఆకర్షణ ఎదుట నిలబడివున్న ఆ ముగ్గుర్నీ మంత్రించినట్లుగా చేస్తోంది.

చుట్టూ చీకటిగా వుంది. వీధి దీపం వెలుతురు మసక మసగ్గా వుంది. ఆ వెలుతురుని అన్నివైపులా ఆక్రమించుకుంది చీకటి. విజయమో, వీరస్వర్గమో అనే సైనికుడి మొండి ధైర్యంలా ఆ కరెంట్ దీపం తన గుడ్డి వెలుతురనే మొండి కత్తిని విధిగా ఝళిపిస్తోంది.

కరెంటు స్థంభం మొదట్లో ఆమె—

ఎదురుగా వాళ్ళు ముగ్గురూ—

మౌనం సూది మొనలా గుచ్చుకొంటోంది వాళ్ళని. చాలా సేపటికి ముగ్గుర్లో ఒకతను గొంతు సవరించుకున్నాడు.

"మేమిక్కడి కెందుకొచ్చామో తెలుసా?" అని ప్రశ్నించాడు తీక్షణంగా.

అతనిపేరు రాంబాబు. నాలుగేళ్ళు వయస్సున్న నిరుద్యోగి. కులాల క్వాలిఫికేషన్ ప్రకారం అతను అలగా కులానికి చెందినవాడు. వాళ్ళ కులంలో ఎవరూ చదువుకోని విధంగా చదివేడు.

కులవృత్తి వొదిలేసి, తల్లిదండ్రుల చెమటనూ, రక్తాన్నీ టానిక్‌లా త్రాగి ఎం.ఏ. చేశాడు. ఆ చదువు చదివేక, చదివినందుకు ఇప్పుడు బాధ పడుతున్నాడు. అతని తమ్ముడు అతనిలాగా చదువుకోలేదు. కాని కులవృత్తి నేర్చుకున్నాడు. వాడికే చీకూ చింతా లేదు ఇప్పుడు. ఉన్నదంతా రాంబాబుకే—

అటు ఉద్యోగం దొరకదు. ఇటు కులవృత్తి చేయటం రాదు. నాలుగేళ్ళనుంచీ ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. కానీ ఉద్యోగం దొరకటంలేదు.

అతను నిరుద్యోగిగా కూడా ఇంటిల్లిపాదికీ బరువుగానే వున్నాడు తల్లిదండ్రుల్లో ఓర్మి నశించిపోయింది. అప్లికేషన్లు పెట్టుకోవటం, ఇంటర్వ్యూలు అటెండవ్వటం, నాలుగేళ్ళనుంచీ అలా డబ్బు కరిగిపోతూనే వుంది.

ఈసారి ఇంటర్వ్యూకి ఇంట్లో యుద్ధమే జరిగింది. తమ్మునితో

సహా అందరూ ఈసడించు కొన్నారు రాంబాబుని. చివరికి పాలిచ్చే గేదెని, ఒక్కగానొక్క ఇంటి కల్పవృక్షాన్ని అమ్మి, ఆ డబ్బు తీసుకొని రాబోయే జాబ్ మీద గంపెడు ఆశతో బయలు దేరాడు.

ఉద్యోగం వచ్చినా రాక పోయినా ఇక తనకిదే చివరి ఇంటర్వ్యూ అనే నిర్ణయం తీసికొని మరీ బయలుదేరాడు.

కానీ, మళ్ళీ ఈసారి కూడా ఫెయిల్యూర్‌ని ఫేస్ చెయ్యక తప్పలేదతనికి. తనుబాగానే చేశాడు ఇంటర్వ్యూ. కాని.... గద్దలా తన్నుకుపోయిందామె.

తలెత్తి భగ్గున మండిపోయేలా చూశాడామెను. రాంబాబు శరీరం లోంచి ఆవేశంతో కూడిన వేడి సెగలు రాసాగాయి. భారంగా ఓ మారు ఊపిరి పీల్చి వొదిలాడు.

ఆమె రాంబాబుకేసి ఓ మారు చూసి, వెంటనే తల తిప్పేసు కొంది. ఆమె చూపుల్లో జీవం లేదు—

ఏదో నిర్లిప్తత....అంతకు మించి విరక్తి

"చెప్పు! చెప్పవేం? మే మిక్కడి కెందు కొచ్చామో తెలుసా?" అరిచాడు రాంబాబు. తన పరిస్థితి గుర్తు చేసుకున్న తర్వాత అతనికి ఆవేశం ముంచు కొచ్చింది.

ఆమె చప్పుడు చేయలేదు.

ఆ మసక వెలుతురులో ముడుచుకొని నిలబడిపోయింది.

"రాక్షసీ! చెప్పు - చెప్పవేం?" అరుస్తున్న రాంబాబుకు అడ్డు పడ్డాడు- పక్కన నిలబడిన మరో యువకుడు. అతను కృష్ణమూర్తి.

"ఆగు రాంబాబూ! ఆవిడ ఉత్తమాటల్తో ఎలా చెబుతుంది? ఈరోజు ఆవిడ అంతం చూడందే వొదిలిపెట్ట దల్చుకోలేదు." అలా అంటూ జేబులోంచి ఓ కత్తి బయటకు తీసాడు కృష్ణమూర్తి.

"ఇదిగో, ఇదేమిటో చూశావా? ఆయుధం—హత్యాయుధం.దీంతో నిన్ను అంతం చేసి, నాలో రగులుతున్న ద్వేషాన్ని చల్లార్చు కొంటాను!"

కృష్ణమూర్తి కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

మధ్య తరగతి కుటుంబంలోంచి వొచ్చిన నిరుద్యోగ ప్రతినిధి అతను. గంపెడు సంసారం—

చదువుకునేప్పుడే అతనికి పెళ్ళ య్యింది. డిగ్రీ చేతికొచ్చి అత నెందుకూ పనికిరానివాడనే నిర్ధారణ జరిగేసరికే అతనికి ముగ్గురు పిల్లలు.

(మిగతా కథ 92వ పేజీలో)

(ఉద్యోగం ..................... 16వ పేజీ తరువాయి)

పుట్టుకొచ్చారు. ఇద్దరు చెల్లెళ్ళు. పెళ్ళికి ఎదిగి చాలా రోజులైంది.

ఉద్యోగం నుంచి రిటైర్ అయిన కృష్ణమూర్తి తండ్రి, అసలు జీవితంలోంచే ఐపోయి నట్టుగా చేతులెత్తేసి ఓ మూల కూర్చుండిపోయాడు.

వయసుతోపాటు అనుభవించిన జీవితం నేర్పిన అలవాటుగా ఎప్పుడూ సణుగుతూ వుండే అతని తల్లి —

కృష్ణమూర్తికీ ఇదే చివరి ఇంటర్వ్యూ—

ప్రయాణం ఖర్చులకి మెళ్ళోని మంగళసూత్రం తీసి తన చేతిబెట్టిన భార్యతో ఈమాటే చెప్పివొచ్చాడు కూడా.

'నిజానికి ఉద్యోగం తనకి రావాల్సింది!

'తనకి ఎమ్మెలో గోల్డ్ మెడ లుంది. ఇంటర్వ్యూలో కంప్యూటర్ లాగా జవాబులు చెప్పాడు అధి కారులకి.

'కాని, అది తనకి రాలేదు— యెందుకని....??'

పళ్ళు కొరుకుతూ ఎదుట నిల బడిన ఆమెకేసి తీవ్రంగా చూశాడు. ఆమెలో మార్పేమీ లేదు.

ఎలావున్నది అలానే నిలబడి వుంది అసలామెకు ఏమీ అర్థం కావటంలేదు. వీళ్ళు ముగ్గురూ తనదగ్గరకెందుకొచ్చారో....

అరగంట క్రితం....

తలుపుమీద చప్పుడైతే భర్తకు మందు త్రాగిస్తున్న తను వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా వీళ్ళు ముగ్గురూ నిలబడి వున్నారు.

"విమల అంటే మీరే కదూ...? ఈ రోజు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యింది మీరేకదూ?..." ప్రశ్నిం చాడు అందులో ఒకతను.

తలూపింది విమల అవునన్నట్టు.

"ఆ ఉద్యోగం గూర్చి మీతో మాట్లాడాలి. కొంచెం బయట కొస్తారా?"

విమల వెనుదిరిగింది. రెండు నిముషాల తర్వాత ఇంట్లోంచి బయటకొచ్చింది.

"ఎక్కడిదాకా?" అంది.

"ఇక్కడికే .... ఆ సందు చివర్లోకి!"

అందరూ నడుస్తూ సందు చివర్లోకొచ్చారు.

స్థంభం మొదట్లో నిలబడింది ఆమె-ఎదురుగా వాళ్ళు ముగ్గురూ.

"అలా బొమ్మలా నిలబడ్డా

వెందుకు? చెప్పవేం? ఎలా దొరికింది నీకా ఉద్యోగం? మాలో ఏం తక్కువుందని మాకు కాకుండా నీకు వచ్చిందది?....” ఒక్కడుగు ముందుకేస్తూ, అంత వరకూ మౌనంగా నిలబడిపోయిన ఆడమనిషి తీవ్రమైన గొంతుతో అంది.

విమల అటు చూసింది. పాతికేళ్ళుంటాయామెకి. ఎర్రగా, బొద్దుగా వుంది. కాని మనిషిలో ఏకోశానా అందమన్నది లేదు.

“నా పేరు రజని-” ఆమె ప్రారంభించింది.

“గత మూడేళ్ళుగా ఉద్యోగం వేటలో తిరుగుతున్నా! భర్త ఒదిలేసాడు నన్ను. ప్రైవేట్‌గా ఎమ్మే ప్యాసయ్యాను. నాకు బ్రతుకు తెరువుకావాలి. అందుకు ఉద్యోగం అవసరం. భర్త వొదిలేసిన స్త్రీగా సంఘంలో బ్రతుకు సాగించటం ఎంత దారుణమో మీకు తెల్సు. అందుకే ఈ ఉద్యోగం కావాలి నాకు. దీనికోసం భర్త నామీద మిగిల్చిపోయిన బంగారు గొలుసు అమ్మేసాను. ఓ మధ్యవర్తి ద్వారా ఆ డబ్బు లంచంగా పెట్టాను.

“కాని, ఆ జాబ్ నాకు రాలేదు. ఎందుకు....? ఎందుకని రాలేదు?”

రజని మాటలు పూర్తికాక ముందే రాంబాబు అందుకున్నాడు- “నీకు మాకన్నా ఎక్కువ క్వాలిఫికేషన్స్ ఏమున్నాయి? నేను ఫస్టు క్లాసు. పైగా సంఘంలో అట్టడుగు వర్గానికి ప్రతినిధిని. ఏ వర్గం ప్రగతి కోసం పాటుపడుతున్నానని మన ప్రభుత్వం చెప్పుకుంటుందో ఆ వర్గం నుంచి వొచ్చినవాణ్ణి నేను. కులవృత్తి వొదిలేసి, ఎందరో చీదరించుకొంటున్నా లక్ష్యపెట్టక చదువుకున్నందుకు — మీలాంటి వాళ్ళ పుణ్యమా అని మా బ్రతుకులు నిరుద్యోగులుగానే గడిచిపోతున్నాయి—అవునా?

“ఇప్పుడు ఇక్కడే నిన్ను చంపేస్తే....?

“ఆ ఉద్యోగానికి తిరిగి ఖాళీ ఏర్పడుతుంది. మళ్ళీ ప్రకటన వస్తుంది. అప్పుడు దొరుకుతుంది మాలో ఎవ్వరికన్నా ఆ ఉద్యోగం.”

అతని ఆవేశాన్ని చూసి ఎంత మాత్రం భయపడ్లేదు విమల. ఒక్క అడుగుకూడా వెనక్కి వేయలేదు.

“నన్ను చంపుతారన్నమాట!” అంది నిశ్చలంగా చూస్తూ.

“అవును! చంపితీరతాను-” కత్తి చేతితో పట్టుకున్న కృష్ణమూర్తి ఓ అడుగు ముందుకేసాడు

“నువ్వు లేకపోతే ఆజాబ్ నాకే

వొచ్చేది! నాకున్న ఆర్థిక ఇబ్బందులు చాలా దారుణమైనవి. ఈ ఉద్యోగం నాకు తప్పని సరిగా కావాలి.

"ఎమ్మేలో నీది థర్డ్ క్లాసు. నాది ఫస్టు క్లాసు. పైగా గోల్డ్ మెడల్ వొచ్చింది.

"లేకపోతే ఏముంది మీలో?.... ఆ జాబ్ మీకే ఎందుకు రావాలి? రిజర్వ్డ్ క్లాస్ రాంబాబుకి రాలేదు. గోల్డ్ మెడలిస్టుకి రాలేదు. లంచ మిచ్చిన రజనికి రాలేదు. ఎందుకు? ఎందుకు రాలేదు?.... నువ్వు.... నువ్వేదో నాటకమాడావు!.... కుట్ర చేశావు. అందుకే నిన్ను చంపి తీరతాను...."

గాలి తీవ్రంగా వీచింది.

కృష్ణమూర్తి మరో అడుగు ముందుకేసాడు. వెనక రజనీ రాంబాబూ అచేతనంగా చూస్తుండి పోయారు.

వీధిలో చీకటి పూర్తిగా కమ్మకుంది. కృష్ణమూర్తి కత్తిని విసిరాడు. మరుక్షణం కెవ్వున అరిచింది విమల.

ఆ అరుపు వీధిలో ప్రతిధ్వనించి. ఆమె దబ్ మని నేల కూలిపోయిన చప్పుడు విన్పించింది.

ఆవేశం దిగిపోయింది ఒక్కసారిగా వాళ్ళ ముగ్గుర్లో! చటుక్కున లైటు మళ్లీ వెలిగింది.

పరుగెత్తుకుని వెళ్లిపోబోతున్న ఆ ముగ్గుర్నీ-"ఆగండి!" అన్న విమల అరుపు పోలీసు లాఠీ దెబ్బకి మల్లే వొచ్చి తగిలింది.

ఆగిపోయారు ముగ్గురూ-

"రండిలా దగ్గరకు" హీన స్వరంతో పిల్చింది విమల.

ఆమెలో చిన్నగా ఆయాసం మొదలైంది.

వెనుదిరిగి వచ్చారు ముగ్గురూ.

విమలఎడమ భుజంలో దిగింది కృష్ణమూర్తి విసిరిన కత్తి. గాయం లోంచి రక్తం స్రవిస్తోంది.

"నేను చచ్చిపోలేదు. నన్ను పూర్తిగా చంపందే పారిపోతారేం? చంపండి!" అంది విమల.

వాళ్లు ముగ్గురూ మౌనంగా వుండి పోయారు. ఏదో చెప్పలేని కదలిక ప్రారంభమైంది- అప్పటికే వాళ్ల మనసుల్లో. మూడు జతల కళ్లు అదే పనిగా చూస్తున్నాయామెను.

"మీరు ముగ్గురూ నిరుద్యోగ జీవితంలో అలసిపోయిన వాళ్ళే-ఒప్పుకొంటాను!" విమల చెప్ప సాగింది.

"కాని నాతో పోల్చుకుంటే మీ అలుపు అంత తీవ్రమైంది కాదు. మీకున్న బరువు

బాధ్యతలు నాకున్నాయ్. నేను ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. అందమైన, ఒద్దికయిన కోడలు దొరికిందని నా అత్తమామలు; చదువుకున్న వదిననని మా మరదులు.. ఆడపడుచులూ నన్ను అమితంగా ఆదరించారు.

"కాని ఆ ఆదరణ ఎక్కువ కాలం నిలవలేదు.

"కారణం-ఏక్సిడెంట్‌లో మా ఆయనకి రెండుకాళ్లూ పోయాయి. ఉద్యోగం పోయింది. మా మరదుల చదువులు ఆగిపోయాయి. మామగారు మనోవ్యాధితో మంచమెక్కారు.

"సూర్యుడు అస్తమిస్తే ముసురుకు పోయిన చీకటిలా ఆ ఏక్సిడెంట్‌తో మా ఇంటిల్లపాదీ చీకటిని కావలించుకొన్నారు. అప్పుడు పుట్టింది నా మీదో అపవాదు.

"నేను కాలుపెట్టిన వేళా విశేషము-మా అయన కాళ్ళు విరగ్గొట్టుకోవటం! ఆ ఇంటికి నేనే అసలైన శనిగ్రహాన్ని! ఇదీ ఆ అపవాదు.

"అప్పట్నించి మొదలైనాయి నాకు కష్టాలు.

"ఇల్లొదిలి పారిపోదామనుకున్నాను కాని....ఆయన!!.... గుండె నిండుగా ప్రేమించానాయన్ని నేను. నా స్థితికి ఆయన కూడా బాధ పడతారు. అందర్నీ మందలించబోతారు. కాని ఆయన్ని పట్టించుకునే దెవ్వరు....??

"విమలా! నన్ను వొదిలిపెట్టి పోవు కదూ....? నీకు నేను అన్యాయం చేశాను కాని, నువ్వు వెళ్లిపోతే, నేను ఒంటరివాణ్ణవుతాను-బ్రతకలేను" అంటాడాయన దీనంగా.

"వెళ్ళొద్దని నిశ్చయించుకున్నాను. నా మీద అపవాదు పోవాలంటే నేనా కుటుంబాన్ని నా భుజాల మీదికెత్తుకొని వారికే లోటూ లేకుండా చూడాలి.

"అందుకోసమే నా ఈ ఉద్యోగ ప్రయత్నం."

చెప్పటం ఆపింది విమల. అలసటగా శ్వాస పీలుస్తూ అందర్నీ చూసింది.

ముగ్గురూ మూడు బొమ్మలకి మల్లే నిలబడి పోయారు. విమల మళ్లీ చెప్పసాగింది-

"నాకీ ఉద్యోగం ఎలా దొరికిందని కదూ అడిగారు? నిజమే.... మీతో పోల్చుకుంటే నా అర్హత ఏపాటి? ... రాంబాబు గారూ! మీరు రిజర్వ్‌డ్.

"కృష్ణమూర్తిగారూ! మీకు గోల్డ్ మెడలుంది. ఇక రజనిగారు-వారు లేడీ కేండిడేట్-పైగా

లంచం పెట్టారు. కాని, మీ అందర్నీ తలదన్నే క్వాలిఫికేషన్ నాకుంది- ఒప్పుకుంటారా?"

రజని చురుక్కున చూసింది - "ఏమిటో ఆ అర్హత?...."

"నేను నీకన్నా అందమైన దాన్నని ఒప్పుకుంటావా రజనీ?" అంది విమల. రజని సూటిగా చూసింది విమల్ని.

'నిజమే!....విమలతో పోల్చుకుంటే తను ఆమె కాలిగోటికైనా సరితూగదు' కాని, రజని పైకి ఒప్పుకోలేదు. ఆమెలోని ఆడమనసు అందుకంగీకరించక మవునంగా వుండిపోయింది.

"ఫ్రెండ్స్!" విమల గొంతు గంభీరంగా పలికింది.

"ఈ ఉద్యోగం కోసం నేను పోగొట్టుకున్న దేమిటో మీకు తెలిస్తే దానిముందు మీ అర్హత లెందుకూ పనికి రావు. నాకు పెళ్ళయ్యింది. భర్త ఇంట్లో వున్నాడు. పతివ్రతలకి పేరు పొందిన దేశంలో పుట్టి— కేవలం ఉద్యోగం కోసం నా శీలాన్ని అమ్ముకొన్నాను.

"నన్నిప్పుడు చంపుతారా ...రు? చంపండి! ఎప్పుడైతే ఉద్యోగం కోసం నేను అధికారులకి లొంగిపోయానో అప్పుడే మానసికంగా చచ్చిపోయాను. ఇప్పుడు మీరు కొత్తగా నన్ను చంపేదేముంది? శారీరకంగా చంపటమే మీరిప్పుడు చెయ్యగల్గేది. మానసికంగా నేనెప్పుడో చచ్చిపోయాను. చంపండి ప్లీజ్! ఈ అపవాదులకీ బరువు బాధ్యతలకీ నేను తట్టుకోలేక పోతున్నా. దయచేసి నన్ను చంపండి....చంపి పుణ్యం కట్టుకోండి!"

ఆమె గొంతు అంతకంతకూ బలహీనమై, ఉధృతంగా తన్ను కొచ్చిన ఏడుపులో కల్సిపోయింది. వెక్కి వెక్కి ఏడవసాగిందామె.

తట్టుకో లేక పోయారు వింటున్న ...గ్గురూ! రైలు పట్టాల మీద చితికిపోయిన నాణెం లాగా అయిపోయాయి- వాళ్ళ మస్తిష్కాలు.

చాలా సేపటికి—

విమల ఏడుపునాపి తలెత్తి చూసేసరికి. తాగిన వాళ్ళలా తూలుతూ దూరంగా నడిచిపోతున్న ...గ్గురూ క... ంచారు. *

·dited & Published VIJAYA ...PI..EEDU
·0, Dhanalaxmi ·onv Madras-· ·6 and
Printed by him at ... ...
·10-Arcot Road. Madras-600 026. Phone 422233